ఇదేనా ఇందిరమ్మ పాలన?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ పాలన అంటే మతోన్మాదాన్ని ప్రోత్సహించడం, అక్రమ అరెస్టులు, కేసులతో నోరు నొక్కడమా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చెంగిచెర్ల ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ నేతలను నిర్బంధించడాన్ని ఆయన ఖండించారు. తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కు మార్‌పై కేసు నమోదు చేశారని, ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేశారని, బాధితులపైనే కేసులు నమోదు చేశారని విమర్శించారు. చంగిచెర్లలో అక్రమ కబేలాను తొలగించాలని, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై మోపిన కేసులను ఉపసంహరించుకోవాలని, బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

చెంగిచెర్ల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన చెంగిచెర్ల దాడి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యలు చేపట్టిందని, బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. నిందితులందరినీ గుర్తించి, వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలని కోరారు. మహిళలు, గర్భిణులు, వృద్ధులపై 300 మంది దాడి చేస్తే కేవలం ఐదుగురిని మాత్రమే అరెస్ట్ చేసిందని విమర్శించారు. బాధితులకు సా యం అందించాలని కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చిన్న ఘటన జరిగినా కాంగ్రెస్ అగ్రనేతలైన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ చార్టెడ్ ఫ్లైట్‌లో వెళ్తుంటారని, చెంగిచెర్లకు రావడానికి మా త్రం వారికి మనసొప్పడం లేదని ఎద్దేవా చేశారు. చెంగిచెర్లలో ప్రభుత్వం ఇంకా కేటాయించని డబుల్ బెడ్‌రూం ఇండ్లను కొందరు ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారని, వారిని ఖాళీ చేయించాలని కోరారు.

కోడ్ ముగిశాకే గురుకుల పోస్టింగులు

సర్వీస్‌లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకే..

ఇప్పటికే 8,705 మంది అభ్యర్థులకు నియామకపత్రాలు

దివ్యాంగుల కోటా, కొన్ని జిల్లాల పత్రాల పెండింగ్

ఎన్నికలు ముగిశాకే వారికీ అలాట్‌మెంట్ లెటర్లు

ఆ తర్వాతే అందరికీ పోస్టింగ్స్: ట్రిబ్ అధికారుల వెల్లడి

హైదరాబాద్, మార్చి28 (నమస్తే తెలంగాణ): గురుకుల నియామకపత్రాలు అందుకొని పోస్టింగ్ ఆర్డర్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభ్యర్థుల అయోమయానికి తెరపడింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వనున్నట్టు ట్రిబ్ (తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు) స్పష్టం చేసింది. దీంతో పోస్టింగ్ ఆర్డర్‌పై ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఊరట లభించింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9 క్యాటగిరీల్లో మొత్తంగా 9,210 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిన ట్రిబ్ ఇటీవలే అందులో 8,708 పోస్టులకు ఫలితాలను ప్రకటించింది. 8,304 పోస్టులను భర్తీ చేసింది. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, పీడీ, లైబ్రేరియన్ క్యాటగిరీల్లో ఎంపికైన అభ్యర్థులను సొసైటీలకు కేటాయిస్తూ నియామక పత్రాలను సీఎం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గత నెల 15న ఒకదఫా, ఈ నెల 4న మరో దఫా ఎల్బీ స్టేడియం వేదికగా అందజేసింది. అలాట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన సొసైటీల్లో రిపోర్టు చేస్తే అక్కడ మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆలస్యమవుతున్నాకొద్దీ ఆ ప్రక్రియను చేపట్టకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ లోగా లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చిపడింది. ఈ కోడ్ ముగిసిన అనంతరమే అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్స్‌ను అందజేస్తామని, అభ్యర్థులు అపోహలను, వదంతులను నమ్మవద్దని ట్రిబ్ అధికారులు తాజాగా వెల్లడించారు. దీంతో గురుకుల అభ్యర్థులకు ప్రస్తుతం భరోసా లభించింది.

అభ్యర్థులందరికీ ఒకేసారి పోస్టింగ్ ఆర్డర్లు

ట్రిబ్ అన్ని పోస్టుల అభ్యర్థులకు ఒకేసారి పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయించింది. తుది జాబితాను ప్రకటించినా వారిలో కొందరికి అలాట్‌మెంట్ ఆర్డర్లను ఇవ్వలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు, రంగారెడ్డి జిల్లాలోని అభ్యర్థులకు నియామకపత్రాలను ఇవ్వలేదు. ఆ కోడ్ ప్రస్తుతం కొనసాగుతుండగానే సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దివ్యాంగ కోటా అభ్యర్థుల నియామక ప్రక్రియ కూడా పూర్తికాలేదు. ఇటీవలే వారి వైద్య పరీక్షలను పూర్తిచేసినా అలాట్‌మెంట్ ఆర్డర్లను ఇవ్వలేదు. వారందరినీ సొసైటీలకు అలాట్ చేయాల్సి ఉన్నది. ఆ తర్వాత అందరికీ ఒకేసారి సొసైటీలు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చే ప్రక్రియను మొదలు పెట్టనున్నాయి. లేదంటే ఇప్పటికే నియామకమైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇస్తే తదుపరి అలాట్‌మెంట్ పొందే అభ్యర్థులు సర్వీస్‌లో జూనియర్లుగా పడే ప్రమాదమున్నది. వారికి ప్రమోషన్లలో ఇబ్బందికరంగా మారే అవకాశమున్నది.

హైకోర్టు తీర్పు మేరకు నియామకాలు చేపట్టండి: గురుకుల అభ్యర్థుల వినతి

హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పులోని మార్గదర్శకాలకు అనుగుణంగా గురుకులాల నియామక ప్రక్రియ చేపట్టాలని పలువురు గురుకుల అభ్యర్థులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జనరల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రిబ్ చైర్మన్‌ను గురుకుల అభ్యర్థులు తూము మనోహర్, ప్రమోద్, మహేందర్, కాశీతోపాటు పలువురు గురువారం ప్రత్యేకంగా కలిశారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీతోపాటు వినతిపత్రం అందజేశారు. మిగిలిపోతున్న ఉద్యోగాలన్నిటినీ తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ మేరకు అధికారులు సైతం సానుకూలత వ్యక్తం చేశారని వారు వెల్లడించారు.

• హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మౌసమీ భట్టాచార్య బాధ్యతలు

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మౌసమీ భట్టాచార్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మొదటికోర్టు హాలులో ఆమెతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించారు. జస్టిస్ మౌసమీ భట్టాచార్య కలకత్తా హైకోర్టు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, జస్టిస్ మౌసమీ భట్టాచార్య కుటుంబసభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

- హైదరాబాద్, మార్చి 29, నమస్తే తెలంగాణ

కవిత అరెస్టు అక్రమం

- **రాజకీయ కుట్రతోనే విపక్ష నేతల అరెస్టు**
- **త్వరలో తిరిగి సొంత గూటికి చేరబోతున్నా**
- **బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు**

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అక్రమమని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అన్నారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పార్టీ అంతర్గత విషయాలు, సమకాలీన రాజకీయ అంశాలపై చర్చ జరిగినట్టు కేశవరావు భేటీ అనంతరం మీడియాతో చెప్పారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడడం, లోక్‌సభ ఎన్నికలు, బీఆర్‌ఎస్ పరిస్థితిపై చర్చించినట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ కవిత, అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సొరేన్ వంటివారిని కేవలం రాజకీయ కుట్రతోనే అరెస్టు చేశారని ఆరోపించారు. ఇటీవల తనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కలిశారని, తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారని చెప్పారు. దీంతో 84 ఏండ్ల వయసులో తిరిగి సొంత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన తనకు కూడా కలిగిందని వెల్లడించారు. బీఆర్‌ఎస్‌లో తనకు సముచిత గౌరవం దక్కిందని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తనకు గౌరవం ఇచ్చారని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా తనను బాగా చూసుకున్నారని అన్నారు. తాను, తన కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నామ ని చెప్పారు. తన కుమారుడు విప్లవ్ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతాడని చెప్పాడని వెల్లడించారు.

బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా: విప్లవ్‌కుమార్

బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతానని రాష్ట్ర టీయూఎఫ్‌ఐడీసీ మాజీ చైర్మన్ కే విప్లవ్‌కుమార్ తెలిపారు. తన తండ్రి కే కేశవరావు, తన సోదరి, మేయర్ విజయలక్ష్మి పార్టీ మార్పుతో తనకు ఎలాంటి సంబంధంలేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తమ కుటుం బ సభ్యులు పార్టీ మారినా తాను మాత్రం వారితో వెళ్లడం లేదన్నారు. బీఆర్‌ఎస్‌కు విధేయుడిగానే ఉంటానని పేర్కొన్నారు. తాను కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసిస్తున్నానని, ఆయన నాయకత్వంలోనే పనిచేస్తానని ప్రకటించారు. తమ కుటుంబసభ్యులు పార్టీ మారిన తర్వాత అన్ని విషయాలను చెబుతానని పేర్కొన్నారు.

పోటీ నుంచి వైదొలగిన కావ్య

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు లేఖ

వరంగల్ : లోక్‌సభ ఎన్నికల పోటీ నుంచి తప్పుకొంటున్నట్టు వరంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం కావ్య ప్రకటించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఈ మేరకు గురువారం లేఖ రాశారు. తన నిర్ణయాన్ని కేసీఆర్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు మన్నించాలని కోరారు.

సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్యను పరిష్కరించండి

సీఎంకు సీపీఐ నేత చాడ లేఖ

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లలోని చేనేత కార్మికుల ఆందోళనను విరమింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సిరిసిల్లలో గత ప్రభుత్వ కాలంలో బతుకమ్మ చీరలకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, అవి చెల్లించకపోవడంతో పరిశ్రమ కుదేళ్లయ్యిందని తెలిపారు.

పలు స్టేషన్ల మధ్య పది ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ (ఎస్‌సీఆర్)లో పది ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తూ గురువారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. విశాఖపట్నం-కర్నూల్‌టౌన్, విశాఖపట్నం-సికింద్రాబాద్, విశాఖపట్నం-తిరుపతి, విశాఖపట్నం-బెంగుళూరు, హిసర్-తిరుపతి రైల్వే స్టేషన్ల మధ్య ఏప్రిల్ 2 నుంచి మే 28 వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వివరించారు.

కనీస వేతనం 28 వేలు ఇవ్వాలి

కార్మికశాఖ డైరెక్టర్‌కు ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల వినతి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.28 వేలుగా నిర్ణయించాలని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ అలైడ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు యూనియన్ నేతలు కార్మికశాఖ అదనపు కమిషనర్ జీ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ప్రశాంతం

- **ఉమ్మడి పాలమూరులో 99.86% ఓటింగ్**
- **8 కేంద్రాల్లో 100%, 2 కేంద్రాల్లో 99%**
- **10 కేంద్రాల్లో ఓటేసిన 1,437 మంది**
- **కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్‌రెడ్డి**
- **కాంగ్రెస్ అభ్యర్థి అన్న కొడుకే అయినా బీఆర్‌ఎస్‌కు కట్టుబడిన ఎంపీ మన్నె**
- **అధికార, ప్రతిపక్ష పార్టీల్లో టెన్షన్**
- **క్రాస్ ఓటింగ్‌పై అనుమానాలు!**

మహబూబ్‌నగర్‌లో ఓటేసేందుకు వస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్, మార్చి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక తీవ్ర ఉత్కంఠ మధ్య కొనసాగింది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో 10 (నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, కొడంగల్, షాద్‌నగర్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 8 చోట్ల 100 శాతం, రెండు చోట్ల 99 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1,439 మంది ఓటర్లకుగానూ 1,437 మంది (99.86 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఓటు వేశారు. గద్వాలలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌నగర్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు ప్రజాప్రతినిధులు ఓటు వేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి పలు కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలీసులు కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రతి ఓటర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే ఓటేసేందుకు అనుమతించారు. కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌ల వద్ద ఆయా జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షించారు. బ్యాలెట్ పద్ధతిలో ప్రాధాన్య క్రమంలో ఓటేసే అవకాశం ఉండటంతో ప్రజాప్రతినిధులను పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి కూర్చోబెట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉప ఎన్నికల పోలింగ్ ఆయా జిల్లా ఎస్పీలతో కలిసి జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్ పర్యవేక్షించారు. సొంత అన్న కొడుకు జీవన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా పోటీలో ఉన్నా మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాత్రం బీఆర్‌ఎస్‌కు కట్టుబడ్డారు. కుటుంబాలు ఒక్కటైనా.. పార్టీలు, సిద్ధాంతాలు వేరు అని నిరూపించారు. వనపర్తి జిల్లా అమడబాకుల ఎంపీటీసీ శేషిరెడ్డి తన కుమారుడి వివాహం హైదరాబాద్‌లో ఉదయం 10 గంటలకు జరిగిన తర్వాత హుటాహుటిన జిల్లాకేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి పరుగెత్తుకొచ్చి ఒక్క నిమిషం ముందుగానే ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఏదుల నరేందర్ స్ట్రెచర్‌పై వనపర్తికి వచ్చి ఓటు వేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను సీల్ వేసి మహబూబ్‌నగర్‌లోని స్ట్రాంగ్‌రూంకు తరలించి భద్రపరిచారు. కాగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన కొద్దిసేపటికే కొన్ని కేంద్రాల వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మీడియాను అనుమతించకుండా కొద్దిసేపు బయటనే ఉంచారు.

సీఐపై ఎమ్మెల్యే బండ్ల ఆగ్రహం

గద్వాల కేంద్రం వద్ద ఉన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని సీఐ అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. దివ్యాంగురాలు వస్తుందని, ఆమె ఓటువేసిన వెంటనే వెళ్లిపోతామని ఎమ్మెల్యే చెప్పినా వినకపోవడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఓటు వేయడానికి వచ్చిన ప్రజాప్రతినిధులపై సైతం సీఐ భీమాకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెళ్లిపోతామని చెప్పినా ఎందుకలా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే నిలదీశారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా పోలీస్ సిబ్బంది సర్దిచెప్పి పంపించారు. అనంతరం పోలీసులు, పాత్రికేయుల మధ్య మాటల యుద్ధం జరిగింది. మరోవైపు పోలింగ్ కేంద్రం సమీపంలోనే అధికార పార్టీ నేతలు తచ్చాడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవటం గమనార్హం. ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరుగుతున్న పోలింగ్ కేంద్రాల వద్ద అధికార పార్టీకి చెందిన కొంతమంది హల్‌చల్ చేశారు.

క్రాస్ ఓటింగ్ భయం

ఎమ్మెల్సీ ఉపఎన్నికతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లో టెన్షన్ మొదలైంది. రెండు పార్టీల అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకున్నది. ఎక్కడ జంపుజిలానీలు ఉన్నారో, చివరి నిమిషంలో ఎవరికి ఓటేశారో తెలియని పరిస్థితి నెలకొన్నది. చాలామంది స్థానిక ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోలేదని, ఆయా పార్టీలను వదిలి ఇతర పార్టీల్లో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్‌కు సంఖ్యాబలం లేకున్నా జంపుజిలానీలతో పోటీకి దిగింది. కాగా అభ్యర్థిపై ఎమ్మెల్యేల అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. ఎమ్మెల్యేలు ఓటు వేసి వెళ్లిపోవటం, ఓటింగ్ సరళిని పట్టించుకోకపోవటంతో మిగతా నేతలు ఖంగుతిన్నారు. మొత్తంగా ఏప్రిల్ 2న జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

• మే 31 వరకు జూనియర్ కాలేజీలకు సెలవులు

జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జూనియర్ కాలేజీలకు ఈ నెల 31 నుంచి మే 31 వరకు వేసవి సెలవులిస్తూ ఇంటర్‌బోర్డు నిర్ణయం తీసుకొన్నది. జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని తెలిపింది. అదే రోజు నుంచి జూనియర్ కాలేజీలకు తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఈ నెల 30తో చివరి వర్కింగ్ డే అని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిబంధనలు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కాలేజీలకు కూడా వర్తిస్తాయని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వచ్చే విద్యాసంవత్సరానికి బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని తెలిపారు.

• ఏఈ, కెమిస్ట్ పరీక్ష వాయిదా

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 31న నిర్వహించాల్సిన రాత పరీక్ష వాయిదా వేసినట్టు ఆ సంస్థ సీఎండీ గురువారం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా పరీక్షలకు వాయిదా వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పరీక్షల నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని జేఎన్‌కో అధికారులు తెలిపారు.

• కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల దందా : ఏబీవీపీ

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో శ్రీచైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాసంవత్సరం ప్రారంభానికి కొన్ని నెలలు ముందే 90 శాతానికి పైగా అక్రమంగా అడ్మిషన్లు జరుపుకొంటున్న విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ తెలిపారు. ఇలాంటి కాలేజీలపై ఇంటర్ బోర్డు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు కార్పొరేట్ విద్యా సంస్థల చేతుల్లో ఇంటర్ బోర్డు, సెక్రటరీ కీలు బొమ్మలుగా తయారయ్యారని విమర్శించారు. ఇంటర్ విద్యను కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపారమయం చేస్తున్నాయని ఆరోపించారు.

• బిల్లులు మంజూరు చేయాలి : పీఆర్టీయూ తెలంగాణ

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : రెండేండ్లుగా ఈ-కుబేరులో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల టీఎస్‌జీఎల్‌ఐ మెచ్యూరిటీ, సరెండర్ బిల్లులు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ రుణాలను వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర నేతలు చెన్నయ్య, భిక్షం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుని కలిసి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా నిధులు విడుదల చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు.

• డిక్లరేషన్ల గడువు పెంపు : ఎన్‌ఎంసీ

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): మెడికల్ కాలేజీలు తమ యాన్యువల్ డిక్లరేషన్, ఇతర వివరాలను సమర్పించే గడువును వచ్చే నెల 10 వరకు పొడిగించినట్టు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) తెలిపింది. గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పలు రాష్ట్రాల్లోని కాలేజీల అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నది.

• బీసీ హాస్టళ్లకు 24.12కోట్ల నిధులు

హైదరాబాద్, మార్చి28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు రూ.24.12 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హాస్టళ్ల నిర్వహణకు బడ్జెట్‌లో 96.50 కోట్లు కేటాయించగా, ఇప్పటికే 72.37 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

• జేఎన్టీయూహెచ్, వాధ్వాని మధ్య ఒప్పందం

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : జేఎన్టీయూ హైదరాబాద్, వాధ్వాని సంస్థ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. నేషనల్ ఆంత్రోప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్క్(ఎన్‌ఈఎన్) బెంగుళూరు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఒప్పందం ప్రకారం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వ్యవస్థాపక నైపుణ్యాలు, మనస్తత్వాన్ని పెంపొందించనున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జేఎన్టీయూ వీసీ కట్టా నరసింహారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, వర్సిటీ ఆంత్రోప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ ఆర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

• సీసీఎంబీతో ఫ్రాన్స్ పరిశోధన సంస్థ ఒప్పందం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ(సీసీఎంబీ)తో ఫ్రాన్స్‌కు చెందిన మెడికల్ రిసెర్చ్ సంస్థ పాస్చర్ ఒప్పందం కుదుర్చుకొన్నది. ఒప్పందంలో భాగంగా వైద్యా, ఆరోగ్య రంగంలో పరిశోధనల్లో సీసీఎంబీ సాయం అందించనున్నది. గురువారం సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరితో ఫ్రాన్స్ ఎంబసీ దౌత్యవేత్త థీరీ మాథౌ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఒప్పందంపై చర్చలు జరిగినట్టు తెలిపారు.

• జేఈఈ మెయిన్ - 2 షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్-2 పరీక్ష షెడ్యూల్‌లో మరోసారి స్వల్ప మార్పు చోటుచేసుకొన్నది. ఏప్రిల్ 4 నుంచి 15 మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు గత నెలలో ఎన్టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షలు ఏప్రిల్ 4 నుంచి 12 వరకు జరుగుతాయని తాజాగా వెల్లడించింది. సిటీ ఇంటిమేషన్ స్లిప్పుల విడుదల సందర్భంగా గురువారం ఈ తేదీలను ప్రకటించింది. వివరాలకు www.nta.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

• టెట్ అర్హతల సందేహాలను తీర్చండి : టీఎస్ యూటీఎఫ్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : టీఎస్ టెట్ -2024 నోటిఫికేషన్‌పై అనేక సందేహాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. గత టెట్ నోటిఫికేషన్లలో ఆగస్టు 23, 2010 కంటే ముందు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అర్హత నుంచి మినహాయింపు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత నోటిఫికేషన్‌లో అలాంటి ప్రస్తావన ఏదీ లేదని తెలిపారు. ఈ క్రమంలో విద్యాశాఖ దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కే జంగయ్య, చావ రవి కోరారు.

ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలి

గురుకులాల్లో మిగిలిన పోస్టులపై హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 28, (నమస్తే తెలంగాణ) : గురుకుల నియామకాల్లో మిగిలిన పోస్టులను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు (ట్రిబ్)కు ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని సూచించింది. విచారణను ఏప్రిల్ 22కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. ఈలోపు ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

మా సమస్యలు పరిష్కరించండి

పీఆర్సీ చైర్మన్‌కు అంధ ఉద్యోగుల వినతి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : కేంద్రప్రభుత్వ రంగ సంస్థలలో పని చేసే అంధ ఉద్యోగుల మాదిరిగానే తమకు కన్వీనియన్స్ అలవెన్సులు, రీడర్స్ అలవెన్సులు, నాలుగు సాధారణ సెలవులు కూడా కల్పించాలని పీఆర్సీ చైర్మన్‌ను రాష్ట్ర అంధ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు కోరారు. ఈ మేరకు గురువారం పీఆర్సీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. సర్వీసులో ఉన్న అంధ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా ఉన్నత విద్య అభ్యసనకు అవకాశం కల్పించాలని కోరారు. పీఆర్సీ చైర్మన్ స్పందిస్తూ... తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు ఆ సంఘం నాయకులు కొన్నె మల్లేశం, బీ రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

డీపీహెచ్ అవినీతిపై విచారణ జరిపించండి

ఏసీబీకి లంబాడీ హక్కుల పోరాట సమితి ఫిర్యాదు

డీపీహెచ్‌పై ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న లంబాడీ హక్కుల పోరాట సమితి నేతలు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) రవీంద్రనాయక్‌పై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్, జాతీయ ప్రధాన కార్యదర్శి నరేందర్ పవార్ గురువారం అవినీతి నిరోధక శాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 7న అన్ని డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లను రద్దు చేసిందని, అయినా డీపీహెచ్ భారీ మొత్తంలో ముడుపులు తీసుకొని కొందరు డీఎంహెచ్‌వోలను మాత్రమే మార్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రవీంద్రనాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

'ఎక్సైజ్' శిక్షణకు సీఎం గ్రీన్‌సిగ్నల్

- **శిక్షణ వివరాలు తెప్పించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
- **1న రిపోర్టు చేయాలని అభ్యర్థులకు ఆదేశాలు**
- **4వ తేదీ నుంచి అధికారికంగా శిక్షణ ప్రారంభం**
- **'నమస్తే' కథనానికి, ఆర్‌ఎస్పీ ట్వీట్‌కు స్పందన**

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థుల నెలన్నర రోజుల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు వారి వారి శిక్షణకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. '400 మందితో సర్కారు చెలగాటం' పేరుతో నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితం కాగా, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్‌కు ముఖ్యమంత్రి స్పందించారు. గురువారం ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి వివరాలు తెప్పించుకొని అభ్యర్థుల శిక్షణకు అంగీకారం తెలిపినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఫిబ్రవరి 14న ఎల్బీ స్టేడియంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొంది న అభ్యర్థులకు ఏప్రిల్ 1న ఎక్సైజ్ శిక్షణ విభాగానికి రిపోర్టు చేయాలని సమాచారం ఇచ్చారు. ఏప్రిల్ 1 నుంచి రిపోర్టు చేసే వారందరికీ 4న అధికారికంగా శిక్షణను ప్రారంభించనున్నట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. అయితే రిపోర్టు చేసే గడువు ఏప్రిల్ 13 వరకు ఉన్నది.

బీఆర్‌ఎస్ జోక్యంతో కదలిక

కేసీఆర్ హయాంలో చేపట్టిన పోలీస్ కానిస్టేబుల్, జైళ్లు, ఎక్సైజ్, అగ్నిమాపక శాఖ ఉద్యోగాలకు తుది కాంగ్రెస్ ప్రభుత్వం ఫలితాలు విడుదల చేసింది. ఫిబ్రవరి 14న ఎంతో ఆర్భాటంగా అర్హత సాధించిన వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చింది. అన్ని విభాగాల శిక్షణను షురూ చేసింది. నెలన్నర గడుస్తున్నా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణ, పోస్టింగుల విషయంలో ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణ అంశాన్ని ప్రస్తావించారు. 'రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా?' అంటూ బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అనంతరం పూర్తి వివరాలతో 'నమస్తే తెలంగాణ' విశ్లేషనాత్మక కథనాన్ని ప్రచురించడంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది.

మొదటి బ్యాచ్‌లో 120 మంది

మొత్తం 614 పోస్టులకు గాను 406 మంది పురుషులు, 203 మంది మహిళలు ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించారు. శిక్షణకు మాత్రం 420 మందికిపైగా సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. తొలుత 120 మందితో తొలి బ్యాచ్‌ను సిద్ధం చేసి 45 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. మిగతా వారిని ఫీల్డ్ ట్రైనింగ్‌కు పంపనున్నారు.